సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లాలో 20 వేల మంది బాలికలకు కేంద్ర ప్రభుత్వ పథకంమైన సుకన్య సంవృద్ధి యోజన పథకం కింద ఖాతాలను తెరిచి బాలికకు పోస్టల్ ఖాతా పత్రాన్ని అందిస్తున్న ప్రధాని మోడీ

అంబరాన్నంటిన సంబరం

- ఘనంగా సత్యసాయి శతజయంతి ఉత్సవాలు
- ప్రధాని, ముఖ్యమంత్రితో పాటు పలువురు ప్రముఖులు హాజరు
- పుట్టపర్తిలో ఆధ్యాత్మిక శోభ
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- బాబా పేరుపై పోస్టల్ స్టాంప్, నాణెం విడుదల

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు బుధవారం నాడు అంబరాన్ని తాకాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతోపాటు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ భారత క్రికెటర్ సచిన్ టెండుల్కర్, సినీ నటి ఐశ్వారాయ్‌తోపాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెద్దఎత్తున పుట్టపర్తి విచ్చేయడంతో ఎక్కడాలేని సందడి నెలకొంది. ఈ సందర్భంగా హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఒకవైపు కళాకారుల ప్రదర్శనలు మరోవైపు ప్రముఖుల ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు సత్యసాయి భక్తులు వివిధ దేశాలు, ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలొచ్చారు.

ప్రధాని చేతుల మీదుగా ఆవిష్కరణలు

ప్రధానమంత్రి నరేంద్రమోడీ సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొంటున్న సందర్భంగా పలు ఆవిష్కరణలు చేశారు. నరేంద్రమోడీ ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి నేరుగా పుట్టపర్తికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లతోపాటు స్థానిక నాయకులు, మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్‌లు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రశాంతి నిలయం సాయికుల్వంత్ హాలులోని సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. అక్కడ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ద్వారా స్థానిక రైతులకు వంద గోవులను దానం చేసే కార్యక్రమాన్ని ప్రధాని మోడీ చేతుల మీదుగా ఆరంభించారు. అనంతరం హిల్‌వ్యూ స్టేడియంలో వంద రూపాయల నాణేం, బాబా జీవిత చరిత్రను తెలియజేసే పోస్టల్ స్టాంపులను ఆవిష్కరించారు. అనంతరం సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లాలో 20 వేల మంది బాలికలకు కేంద్ర ప్రభుత్వ పథకంమైన సుకన్య సంవృద్ధి యోజన పథకం కింద ఖాతాలను తెరిపించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముగ్గురు పిల్లలకు దీనికి సంబంధించిన పత్రాలను అందజేశారు.

అలరించిన కళా ప్రదర్శనలు

శతజయంతి ఉత్సవాల్లో ప్రధాన మంత్రితోపాటు ప్రముఖులు విచ్చేసిన సందర్భంలో హిల్‌వ్యూ స్టేడియంలో పెద్దఎత్తున కళా ప్రదర్శనలు చేపట్టారు. ఇవి అందరినీ అలరించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతోపాటు, ప్రముఖులందరూ ఎంతో ఆసక్తిగా ప్రదర్శనలను తిలకించారు. కూచిపూడి నృత్యం, గుజరాత్‌కు చెందిన గర్బా డ్యాన్సుతోపాటు, వివిధ భాషాల్లో సత్యసాయిబబాను కీర్తిస్తూ రూపొందించిన గేయానికి బాలికలు నృత్య ప్రదర్శనలు చేపట్టారు. ఇక ప్రముఖ గాయిని సుధారంగనాథన్ గీతాలాపన చేపట్టారు. పద్మశ్రీ అవార్డు గ్రహిత శివమణి ఆధ్వర్యంలో తమిళనాడు, కేరళ కళాకారులతో కలిపి చేసిన ప్రదర్శనలతో స్టేడియం మారుమోగింది.

బాబా శతజయంతి ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

బాబా చూపిన ప్రేమమార్గం అనుసరణీయం

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

సత్యసాయి బాబా మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన చాటిక ప్రేమ, ఆయన బోధనాలు, సేవా స్ఫూర్తి ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ అందరినీ నడిపిస్తున్నాయని కొనియాడారు. 'లవ్ ఆల్ –సర్వ్ ఆల్' అన్న బాబా మాటలు ప్రేమను సేవగా మార్చే ఆధ్యాత్మిక సందేశమని పేర్కొన్నారు. గుజరాత్ భూకంపం సమయంలోనూ అక్కడికి సత్యసాయి భక్తులు ఎంతో మంది వచ్చి బాధల్లోనున్న ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. ఆ సేవలను ఆ సంస్థ ఇప్పటికీ కొనసాగించడం అభినందనీయమన్నారు. వసుదైక కుటుంబమన్న నినాదానికి సత్యసాయి జీవితం సజీవ ఉదాహరణ అని అభివర్ణించారు. సేవే భారతీయత నాగరికతకు మూలం అన్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ద్వారా మూడు వేల కిలోమీటర్లు పైపులైన్ ఏర్పాటు, ఒడిశాలో వరద బాధిత కుటుంబాలకు గృహ నిర్మాణాలు, బిల్లింగ్ కౌంటర్లేలేని ఆసుపత్రులు, విద్యాలయాల ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఇది ఆధ్యాత్మికత అంటే ప్రజలకు సేవ చేయడం, ప్రేమను పంచడం అన్నదానిని బాబా చాటి చెప్పారని కొనియాడారు.

'మానవసేవయే మాధవ సేవ' అనిచాటిన బాబా

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



- ముఖ్యమంత్రి నారా చంద్రాబాబు నాయుడు మానవసేవయే మాధవసేవ అని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి సత్యసాయిబాబా అని కొనియాడారు. ఆయన విద్య, వైద్యం, తాగునీటి వసతిని లక్షల మందికి ఉచితంగా అందించారని గుర్తు చేశారు. ప్రేమ ఒక్కటే మతం... హృదయం ఒక్కటే భాష, మానవత్వమే కులం అని ప్రపంచానికి చాటిన గొప్ప మానవతావాది సత్యసాయి బాబా అని పేర్కొన్నారు.

- ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ ఆయన ప్రవచనాలతో ఎంతో మంది ప్రభావితమై ప్రజలకు ఉచితంగా సేవచేయడానికి ముందుకొచ్చారన్నారు. ఆయన చూపిన సేవామార్గం అనుసరణీయమని పేర్కొన్నారు.

- సత్యసాయి బాబా బోధించిన ప్రేమ, సేవా మార్గాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు బాధ్యతని ట్రస్టీ సభ్యుడు అర్‌జె.రత్నాకర్ తెలియజేశారు. శతజయంతి మహోత్సవాల్లో భాగంగా ఆయన మాట్లాడారు. సత్యసాయి బాబా ప్రపంచానికి ప్రేమ, శాంతి, సేవ మానవతా విలువలను చాటి చెప్పారన్నారు. సత్యసాయి విద్యాసంస్థల్లో చదివిన వేలాది మంది విద్యార్థులు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవ చేస్తున్నారని గర్వంగా తెలిపారు.

- సత్య సాయి బాబా చేసిన సేవతోనే ఆయన ప్రజల గుండెల్లో భగవంతుడు అయ్యాడని ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బాబా ఆధ్వర్యంలో ఆధ్యాత్మికతకు గ్లోబల్ ఐకాన్‌గా పుట్టపర్తి ఎదిగిందన్నారు. విద్య, వైద్యం అందరికీ అందించేలా సేవా మార్గాన్ని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు.

- భారత మాజీ క్రికెటర్ సచిన్ టెండుల్కర్ సత్యసాయి బాబాతో తనకున్న అనుబంధాన్ని తెలియజేశారు. చిన్నతనంలో తనకు జుట్టు ఆయనలా ఉందని అందరూ బాబా అనే వారిని గుర్తు చేసుకున్నారు. 2011లో ఆయన్ను కలిశాక తన సందేహాలు, ఆలోచనలను ముందుగా గ్రహించి నివృత్తి చేయడం ద్వారా ప్రేరణ పొందానిని చెప్పారు. ఆయన మాటలు తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయని పేర్కొన్నారు.



- సినీనటి ఐశ్వర్యారాయ్ మాట్లాడుతూ సత్యసాయి బాబా ఆధ్వర్యంలో బాలవికాస్ పేరుతో వేలాది మంది పిల్లలకు నైతిక విలువతోపాటు విద్యను అందిస్తున్నాయన్నారు. బాబా ఎప్పుడు ఆంగ్లలో ఐదు డి లగురించి చెప్పేవారన్నారు. క్రమశిక్షణ, అంకితభావం, భక్తి, దృఢసంకల్పం,. సత్యం వివేకం కలిగుండాలని బోధించేవారన్నారు. ఇవే జీవితానికి పునాది అని చెప్పేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు, శ్రీనివాస వర్మ తోపాటు రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవితమ్మ, ఆనగాని సత్యకుమార్‌తోపాటు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టి రత్నాకర్, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఛైర్మన్ చక్రవర్తి, సత్యసాయి ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ నిమిష్ పాండే తదితరులు పాల్గొన్నారు.

బాబా పేరుతో రూపొందించిన పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబ నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సచిన్ టెండుల్కర్ తదితరులు

బాబా మహాసమాధిని దర్శించుకుంటున్న ప్రధాని మోడీ

శతజయంతి ఉత్సవాల సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

రైతుల సమస్యలపై పార్టీలకు అతీతంగా ఉద్యమించాలి

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు హరి

సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి హిందూపురం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పంజాబ్ రైతులు ఉద్యమించిన ఉద్యమ స్ఫూర్తితో పార్టీలకు అతీతంగా రైతన్నలు సమస్యలపై ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్ లో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి అధ్యక్షతన పట్టు రైతు సంఘం జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి, పట్టు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోంకుమార్, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత రైతులతో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పట్టు రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పట్టు రైతుల సమస్యల పైన అలుపెరుగని పోరాటాలు చేయడంతో ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి కేజీకి సిబికి రూ.10, బైవోల్టిన్ కు రూ. 50 ఇన్సెంటివ్ రూపంలో ఇవ్వడంతో పాటు షెడ్ల నిర్మాణాలతో పాటు ఇతర వ్యవసాయ పరికరాలను పట్టు రైతులకు సబ్సిడీ రూపంలో అందించారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన టిడిపి పట్టు రైతులను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. అనంతరం 2019లో ఎన్నికల సమయంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి పట్టు రైతులతో పాటు పాడి రైతులకు సబ్సిడీలు అందించి ఆదుకుంటామని హామీలు ఇచ్చి అనంతరం పట్టించుకోలేదన్నారు. దీంతో 2019 నుంచి కోట్లాది రూపాయలు పెండింగ్ లో ఉందన్నారు. దీనికోసం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయడంతో పాటు ప్రభుత్వ పెద్దలను కలిసినప్పటికీ ప్రయోజనం లేదన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సైతం రైతన్నలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. హిందూపురం పట్టుగుళ్ల మార్కెట్ నుంచి సంవత్సరానికి రూ. 1. 50 కోట్లు ఆదాయం వస్తున్నప్పటికీ రైతులను ప్రభుత్వం ఆదుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్సెంటివ్ తో పాటు సబ్సిడీ కోసం పట్టు రైతులు అలుపెరుగని ఉద్యమాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రైతులను ప్రభుత్వాలు ఆదుకోకపోగా భూసేకరణ చట్టాన్ని అడ్డుపెట్టుకొని బలవంతపు భూసేకరణకు సిద్దమైందని విమర్శించారు. ఈ భూ సేకరణ సైతం పెద్దల జోలికి వెళ్లకుండా పేదలు, దళిత, గిరిజనుల భూములనే సేకరిస్తుందని అన్నారు. అభివృద్ధికి రైతులు, రైతు సంఘం నాయకులు అడ్డు చెప్పడం లేదని, ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల భూమిని భూసేకరణ చట్టాన్ని అడ్డుపెట్టుకొని పరిశ్రమల పేరిట సేకరించారని అన్నారు. ఆ భూముల్లో పరిశ్రమలను తీసుకుని వచ్చి స్థానిక యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పంటలు పండే భూములను కార్పొరేట్ కంపెనీలకు దారాదత్త చేయడం... వీరు ఆ భూమిని వివిధ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని చేతులు దులుపుకోవడం పరిపాటిగా జిల్లాలో మారిపోయిందన్నారు. సేకరించిన భూములు బీడు భూములుగా మారిపోవడంతో పాటు భూమిని కోల్పోయిన రైతన్నలు కూలీలుగా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూపురం పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న పట్టుగూళ్ల మార్కెట్‌ను రూ. 8 కోట్లతో నూతనంగా నిర్మాణం చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమన్నారు. అయితే ప్రభుత్వం వారికి ఇష్టం వచ్చిన విధంగా నిర్మాణం చేయకుండా పట్టు రైతులను, రైతు సంఘం నాయకుల సలహాలు తీసుకుని నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఈ విషయాన్ని మార్కెట్ అధికారి కంపండ్లకు వివరించారు. పట్టు రైతుల సమస్యలపై త్వరలో జిల్లా వ్యాప్తంగా పాదయాత్ర కార్యక్రమాలు చేపట్టి రైతుల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. త్వరలో కార్మిక, కర్షక ఐక్య ఉద్యమాలు చేపడతామని సమావేశంలో తీర్మాదించారు. ఈ సమావేశంలో నాయకులు రామకృష్ణారెడ్డి, నవీన్, జయరామిరెడ్డి, చైతన్య గంగిరెడ్డి, గోవిందప్ప, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్‌సప్లయ్ హమాలీ యూనియన్ నాయకులతో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

స్టాక్ పాయింట్ హమాలీల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

స్టాక్ పాయింట్లల పనిచేస్తున్న హమాలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులు గంగాధర్, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు పెదపల్లి బాబా, సిఐటియు మండల కన్వీనర్ రమణ, పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్టాక్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఓబులు మాట్లాడుతూ 25 కేజీల బియ్యం బ్యాగుకు 10 రూపాయలు ఇవ్వాలన్నారు. కార్మికులకు ఇఎస్ఐ అమలు చేయాలి. గవర్నమెంటు స్కూళ్లకు బియ్యాన్ని ఎఫ్ పి షాపుల ద్వారా పంపిణీ చేయాలన్నారు. .స్టాక్ పాయింట్ల వద్ద హమాలీలకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు వైజాగ్ లో డిసెంబర్ 31 నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ కుళ్లాయప్ప, పెడపల్లి బాబా, సివిల్ సప్లై హమాలీలుకిష్టప్ప, నారాయణస్వామి, నాగరాజు, అంజి, కేశప్ప, మన్సూర్, నరసింహమూర్తి, సూరి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తీ-హిందూపురం

ప్రతిభా విద్యార్థులతో నాయకులు, అధికారులు

పోటీ తత్వానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకొని విద్యలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు నాసా కాంటెస్ట్ ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం చైతన్య పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తులో వైజ్ఞానిక, శాస్త్ర విభాగాలదే అగ్రస్థానమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఆయా రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపికైన విద్యార్థులకు నాసాకిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి. శ్రీనివాసులు, ఏవో ప్రభాకర్ రెడ్డి, డీన్ నాగరాజు, నాసా ఇన్చార్జ్ శ్రీనివాసరెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ తిరుమలేశ్వర రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

23న 'అనంత'కు జగన్

రాప్తాడు : వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 23వ తేదీ అనంతపురం వస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు వైసిపి నాయకులు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి తెలిపారు. తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి కూమార్తె వివాహం ఆదివారం రాప్తాడు సమీపంలో జరగనుంది. ఈ వివాహ వేడుకకు జగన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జగన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, డీఎస్పీ వెంకటేశులు, సిఐ శ్రీహర్ష వివాహ వేదిక, హెలిప్యాడ్, తదితర ప్రాంతాలను పరిశీలించారు. జాతీయ రహదారి నుంచి లింగనపల్లికి వెళ్లే దారిలో బొమ్మేపర్తి సచ్చిదానందస్వామి ప్రవేశద్వారం సమీపంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు పరిశీలించారు. ఇక్కడి నుంచి వివాహ వేదిక వద్దకు కారులో వెళ్లేలా ఏర్పాట్లు చేయనున్నారు.

గ్రంథాలయాల సేవలు ఆదర్శనీయం

ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ స్వప్న

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గ్రంథాలయాల ద్వారా ప్రజలు, నిరుద్యోగులు, యువతకు అందిస్తున్న సేవలు ఆదర్శనీయంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ స్వప్న అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం 6వ రోజు కొనసాగాయి. బుధవారం సాయంత్రం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమా అధ్యక్షతన నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా స్వప్న, లలితకళాపరిషత్ కార్యదర్శి గాజుల పద్మజ, డాక్టర్ ఎమ్ఎస్.బంద, అసిస్టెంట్ ప్రొఫసర్ సువర్ణ మోహన్, ఎన్.యంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రరియన్ పి.కమ్మన్న, సహా గ్రంథాలయాధికారి డి.గోవిందు, సీనియర్ అసిస్టెంట్ రాజు, రామాంజినమ్మ, జిఎం.బాషా, కిరణ్, జీవన, బాలచంద్ర, ఇందిరమ్మ, ఉజ్జనేశ్వరి, శివమ్మ, శిరీషా, గంగాధర్ పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు

గ్రంథాలయంలో మహిళా దినోత్సవం

చెన్నేకొత్తపల్లి : 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి, మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయ శాఖ అధికారి జయరాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, హై స్కూలు హెచ్ఎం ఓబులమ్మ, హాస్టల్ వార్డెన్ శ్యామల హాజరయ్యారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిరమ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి, మహిళా పోలీసు అనుషా, నారాయణ స్వామి, నాని స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రతిభా విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి సవిత

విద్యార్థులకు మంత్రి అభినందన

ప్రజాశక్తి - రొద్దం

స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన అండర్ - 17 విభాగం హైజంప్‌లో రొద్దం 2 ఎం జె పి స్కూల్ కు చెందిన విద్యార్థి దివాకర్, లాంగ్‌జంప్‌లో సంతోష్ కుమార్ ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో పెనుకొండలోని మంత్రి తన క్యాంపు కార్యాలయంలో మంత్రిని ప్రిన్సిపల్ అనిత, విద్యార్థులు కలిశారు. ఈసందర్భంగా మంత్రి ప్రతిభా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమం ప్రిన్సిపల్ అనిత, మండల నాయకులు చిన్నప్పయ్య,తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండల పరిధిలోని అల్లాపల్లి పంచాయతీ గౌనిపల్లిలో కుష్టి వ్యాధి పై అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సి హెచ్ఒ ప్రమీలమ్మ, మాట్లాడుతూ కుష్టువ్యాధి, లక్షణాలు నివారణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మీదేవి ఎంపీహెచ్ఏ గోపాల్ నాయక్, అంగన్వాడి కార్యకర్తలు షమీం, ధనమ్మ, ఆశా వర్కర్లు లక్ష్మీ, వహీదా, సుశీలమ్మ, గాయత్రి, ఉమాదేవి, అనసూయమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

అఖిలభారత సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

72 వ అఖిలభారత సహకార వారోత్సవాలు మండలంలోని ఒడిసి, అల్లాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘ కార్యాలయాల్లో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ సహకార బ్యాంకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ బోయపల్లి శివారెడ్డి, మహబూబ్ బాషా, సబ్ డివిజనల్ అధికారి జనార్ధన్, షాహిద్ బాషా , బ్యాంక్ మేనేజర్ సుమిత , సూపర్‌వైజర్ బ్రహ్మాచారి,డైరెక్టర్లు నారాయణప్ప, టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మార్కెట్ డైరెక్టర్ నిజాం, కంచి సురేష్, మధు, బాలు, సీఈవోలు రామాంజనేయులు, రామ్మోహన, టిడిపి నాయకులు, రైతులు తది తరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో ఎస్సీ కాలనీ ఒకటో వార్డులో నివాసముంటున్న నరసింహ కుమారుడు నవీన్ కుమార్ 11 సంవత్సరాలు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, నిమ్మల యువ శేఖర్ దంపతులు బాలుని చికిత్స కోసం10వేల రూపాయల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ మేరకు బాలుని తండ్రినరసింహకు నగదు అందజేశారు.

ఇందిరాగాంధీకి నివాళి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల పౌర శాఖ గ్రంధాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు బుధవారం ఇందిరాగాంధీ జయంతి వేడుకలను గ్రంధాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దళితవాడ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ కవితా పాల్గొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలువేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది రాము, రమణ నాయక్, సరస్వతమ్మ ,గంగాధర్ తో పాటు వెన్నెల, రాజేశ్వరి, వైష్ణవి, కేపీఎల్ మున్సిపల్ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

23న జిల్లాస్థాయి చెకుముకి పరీక్షలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఈనెల 23న ఆదివారం పెనుగొండ పట్టణంలోని గ్లోబల్ జెన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పరీక్షల విజేతలకు జిల్లాస్థాయి చెకుముకి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు బి. నరసారెడ్డి పేర్కొన్నారు. మండల స్థాయిలో విజేతలైన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల జట్లుఈ పరీక్షకు హాజరుకావాలని ఆయన కోరారు. విజేతలకు బహుమతులతో పాటు హాజరైన ప్రతి ఒక్క విద్యార్థికి ప్రశంసా పత్రము, ప్రతి పాఠశాల కు ఒక జ్ఞాపిక అందజేయబడుతుందని అన్నారు. జిల్లా స్థాయి పరీక్షలలో ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల నుంచి అత్యధిక మార్కులు సాధించిన ఒక్కో జట్టును మాత్రమే రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొడవండ్లపల్లి విద్యార్థిని

ప్రజాశక్తి - ముదిగుబ్బ

రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడలలో మండలంలోని కొడవండ్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 9 వ తరగతి విద్యార్థి ప్రవల్లిక ప్రతిభ కనపర్చింది. అండర్ 17 విభాగంలో ఖోఖోలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ రాశినేని రామానాయుడు, వ్యాయమ ఉపాధ్యాయులు శాంతలింగం, ఉపాధ్యాయులు ప్రవల్లికను అభినందించారు.

విద్యార్థిని ప్రవళ్లికతో ఉపాధ్యాయులు

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

నరేష్‌కుమార్

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్ ఎంపిక పట్ల ఆసంఘం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్ర రెడ్డి ఎం. సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు బుధవారం మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఎంప్లాయిస్ అథ్లెటిక్స్ పోటీలలో రొద్దం మండలం కంచి సముద్రం ప్రాథమిక పాఠశాలలో ఎస్ జి టీ గా పని చేస్తున్న ఉపాధ్యాయుడు జీసీ నరేష్ కుమార్ 400 మీటర్ల విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలోనూ, 100 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. దీంతో ఈయన బీహార్ లోని పాట్నాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. జాతీయ స్థాయిలో కూడా ప్రథమ శ్రేణిలో రాణించి రాష్ట్రానికి, యు.టి. ఎఫ్ కు మంచి పేరు తీసుకురావాలని గౌరవాధ్యక్షులు భూతన్న, సహాధ్యక్షులు జి హెచ్ బాబు, సీతా మాలక్ష్మి, జిల్లా కోశాధికారి డి. శ్రీనివాసులు , జిల్లా కార్యదర్శులు తహీర్ వలి, టీవీ సుబ్బా రెడ్డి, నారాయణ స్వామి, లక్ష్మి నారాయణ, శివ శంకర్, నరసింహప్ప , రామకృష్ణ నాయక్ , లత దేవి , క్రిస్టప్ప, ఆడిట్ కమిటీ కన్వీనర్, మహంతేశ్వర, రాష్ట్ర కౌన్సిలర్ మారుతీ శ్రీనివాసులు, మేరీ వరకుమారి, తదితరులు ఆకాక్షించారు.

జూడో పోటీల్లో చిగిచెర్ల పాఠశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండల పరిధిలోని చిగిచెర్ల ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం విక్రాంత్ జూడోలో 45 కేజీల విభాగంలో రెండవ స్థానంలో నిలిచినట్లు పాఠశాల హెడ్మాస్టర్ తిమ్మారెడ్డి తెలిపారు. జాతీయ సబ్ జూనియర్ జూడో పోటీలలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు 10 సంవత్సరాల తర్వాత వెండి పతకం సాధించడం విశేషమని వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల పి డి ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాల సహకార సంఘం స్థలాన్ని కాపాడాలి

రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి హిందూపురం

పట్టణంలో మెయిన్ బజార్ లో ఉన్న పాల సహకార సంఘం స్థలాన్ని ప్రభుత్వం కాపాడాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పి శ్రీనివాసులు, పట్టు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సిద్ధారెడ్డి డిమాండ్ చేశారు. కబ్జాకు గురి అయిన పాడి రైతుల స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హిందూపురం ప్రాంతంలో వ్యవసాయం తర్వాత అత్యధికంగా ఆధారపడి జీవనం సాగిస్తున్న పాడి పరిశ్రమ రానురాను దిగజారి పోతోందన్నారు. ఈ నేపథ్యంలో ఆ పరిశ్రమకు చెందిన లక్షల రూపాయలు విలువ చేసే స్థలాన్ని హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నప్పటికీ అటు పోలీసులు, ఇటు అధికార పార్టీ నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. 1983లో ప్రారంభించిన హిందూపూర్ కోఆపరేటివ్ మిల్క్ సప్లై యూనియన్ లిమిటెడ్ భవనాన్ని ఏడాది క్రితం గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికి రాత్రి కూల్చివేశారన్నారు. అందులో ఉన్న రూ. 20 లక్షల విలువ చేసే పాల శీతలీకరణ యంత్రాలు, పాలకేన్లు, ఇనుప పెట్టె, పత్రాలను తీసుకెళ్లిపోయారని ఆ సమయంలో రైతులు హిందూపురం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని చెప్పారు. అయినప్పటికీ ఇంతవరకు పోలీసులు విచారణ చేసి బాధ్యుల పైన చర్యలు తీసుకోలేదన్నారు. తాజాగా రాత్రికి రాత్రి ఆ ఖాళీ స్థలంలో షెడ్డు ఏర్పాటు చేసి కబ్జా చేయడానికి ప్రయత్నించారని, అయినప్పటికీ పోలీసులు నిర్లక్ష్యం వీడలేదని విమర్శించారు. సంవత్సరం క్రితం పక్కాభవనాన్ని కూల్చితేనే పోలీసులు ఇప్పటివరకు కూల్చిన వారిని పట్టుకోలేదని, కూటమి ప్రభుత్వంలో ఎక్కడికక్కడ దౌర్జన్యాలు కబ్జాలు పెరిగిపోయాయని అన్నారు. పాడి రైతులు వారి స్థలాన్ని వారే రక్షించుకోవడం జరిగిందన్నారు. ఈ స్థలాన్ని పాడి రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి, ఇదే స్థలంలో ప్రభుత్వం పాల డైరీ నిర్మాణం చేసి, పాడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ రాము పాల్గొన్నారు.

కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- హిందూపురం

హిందూపురం రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులకు తెలిపారు. పంజాబ్ రాష్ట్రానికి చెందిన లఖ్వీందర్ సింగ్ (37) రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. హిందూపురం రైల్వే పోలీస్ స్టేషన్లో రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. రైలులో బెంగళూరుకు వెళుతున్న ఆయన రైలు నుండి కింద పడగా శరీరంపై తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. అయితే అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సుంది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి శత జయంతోత్సవాలలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.శ్రీ సత్య సాయి విద్యాసంస్థల విద్యార్థులు, కూచిపూడి నృత్య కళాకారులు, డ్రమ్స్ కళాకారులు నిర్వహించిన నృత్య రూపాలు, సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పద్మశ్రీ గ్రహీత, కూచిపూడి నృత్య గురువు, కళాకారుని సుధా రఘునాథన్, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన, జయశ్రీ బాల త్రిపుర సుందరి, అనే పాటకు విద్యార్థులు చేసిన కూచిపూడి నృత్యం సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంతేకాక సత్యసాయి ఈశ్వరమ్మ హై స్కూల్ విద్యార్థులు నిర్వహించిన గర్భ డాన్స్, గుజరాతి సాంప్రదాయ నృత్యం. శ్రీ సాయిరాం ,జయ సాయిరాం, అనే పాటకు సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు చేసిన నృత్యం ప్రజలను విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంతేకాక పద్మశ్రీ అవార్డు గ్రహీత డ్రమ్స్ విద్వాంసుడు శివమణి . భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా నిర్వహించిన డోలు, సన్నాయి, తబలా వాయిద్యం తో సత్యసాయి భక్తులను తన్మయం చెందారు. ఈ సందర్భంగా కళాకారులను ప్రజాప్రతినిధులు సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు వారిని అభినందించారు

సచిన్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సత్యసాయి బాబా 100 వ జయంతోత్సవాలకు పుట్టపర్తికి విచ్చేసిన అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్ ను పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, కేంద్ర నెహ్రూ యువకేంద్రం కో ఆర్డినేటర్ సోమగుట్ట విష్ణువర్ధన్ రెడ్డి బుధవారం కలిశారు. ఈసందర్భంగా అయనకు పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అన్ని విధాలుగా వెనుకబడిన ఈ ప్రాంతంలో క్రీడలను ప్రోత్సహించే విధంగా పుట్టపర్తి ప్రాంతంలో ఒక అంతర్జాతీయ స్థాయిలో స్టేడియం ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే సింధూర సచిన్ టెండూల్కర్ ను కోరారు. సత్యసాయి బాబా మరియు ఈ పుట్టపర్తి ప్రాంతం అంటే ప్రత్యేకంగా తనకు ఎంతో అభిమానం ఉందని క్రికెట్ స్టార్ ఈ సందర్భంగా వెల్లడించారు.

ప్రధానమంత్రికి స్వాగతం పలికిన ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సత్య సాయి బాబా శత జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పుట్టపర్తి విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘన స్వాగతం పలికారు. ప్రధాని ఢిల్లీ నుండి నేరుగా పుట్టపర్తి విమానాశ్రయానికి 10 గంటలకు చేరుకోగా విమానాశ్రయం నుండి గట్టి భద్రత ఏర్పాట్ల నడుమ ప్రశాంతి నిలయం చేరుకున్నారు. అనం తరం సత్యసాయి మహా సమాధిని దర్శించుకుని, సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూరు గిరి ఆవులను పేద ప్రజలకు అందించే కార్యక్రమంలో భాగంగా ఒక ఆవును రైతుకు అందజేశారు. అనంతరం హిల్ హు స్టేడియంలో నిర్వహించే సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పుట్టపర్తి విమానాశ్రయంలో ఆయనకు ముఖ్యమంత్రి తో పాటు మంత్రులు అనగాని సత్య ప్రసాద్, నారా లోకేష్, సుజనా చౌదరి ,వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్, పరిటాల సునీత, పయ్యావుల కేశవ్ , బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవన్, ఎంపీ పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, నాయకులు విష్ణువర్ధన్ , బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ ,పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

కదిరి అర్బన్ : పుట్టపర్తి విమానాశ్రయంలో ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ స్వాగతం పలికారు. రాష్ట్ర మంత్రులతోపాటు ప్రముఖులు అధికారులు పాల్గొన్నారు.

టిడిపి అనుబంధ కమిటీల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి - చిలమత్తూరు

టిడిపి మండలశాఖ అనుబంధ కమిటీల అధ్యక్షులను అధిష్టానం నియమించింది. తెలుగు యువత మండల అధ్యక్షులు గా మురళిని, బీసీ సెల్ అధ్యక్షులుగా అంజిని నియమించారు. చిల మత్తూరు గ్రామానికి చెందిన రామాం జినేయులును ఎస్సీ సెల్ మండల అధ్యక్షులుగా నియ మించారు. తెలుగు మహిళా అధ్య క్షురాలుగా విజయలక్ష్మి , ఎస్టి సెల్ వెంకట్రాముడు, మైనా రిటీల సెల్ గౌస్ బాషా, కోడూరు కి చెందిన హరీష్‌ని టిఎన్ఎస్ఎఫ్‌కి నియమించారు.. నూతన అధ్యక్షుల నియామకాలతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే బాలకృష్ణతో తెలుగు యువత మండల అధ్యక్షులు మురళి

కమిటీని రద్దు చేసి విచారణ జరిపించాలి

ముతవల్లితో సమావేశమైన ముస్లింమైనార్టీ యువకులు

ప్రజాశక్తి- హిందూపురం

పట్టణంలోని మేళాపురం సర్కిల్ సమీపంలో ఉన్న మస్జిద్ ఏ కౌసర్ కమిటీని రద్దుచేసి పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని ఆ ప్రాంత ముస్లిం మైనారిటీ యువకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్‌కు అన్ని ఆధారాలతో లిఖిత పూర్వకంగా బుధవారం ఫిర్యాదు చేశారు. అదేవిధంగా జామీయా మసీదు కమిటీ వారితో బుధవారం రాత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత యువకులు మాట్లాడుతూ పట్టణంలోని మేళాపురం ప్రాంతంలోని ముబారక్ నగర్ లో గత 26 సంవత్సరాల క్రితం దాతల సహకారంతో మసీదు నిర్మాణం కోసం రూ. 4 లక్షలు వెచ్చించి 10 సెట్ల స్థలాన్ని కొనుగోలు చేసి ఆ భూమిని మస్జిద్ ఏ ముజాహిద్ పేరున ముత్వల్లి సమీవుల్లా పేరుతో రిజిస్టర్ చేయడం జరిగిందన్నారు. అయితే ఆ స్థలంలో మసీదు నిర్మాణం చేపట్టకుండా మేళాపురం సర్కిల్ సమీపంలో దాతల సహకారంతో ఐదు సెంట్ల స్థలంలో కౌసర్ మజీద్ నిర్మాణం చేయడానికి పదిమందితో కమిటీ ఏర్పాటు చేశారన్నారు. అయితే ఆ కమిటీ ఇప్పటివరకు ఎటువంటి లావాదేవీలు చూపించడం లేదని వెంటనే కమిటీని రద్దుచేసి కమిటీ చేపట్టిన లావాదేవీల పై సమగ్ర విచారణ జరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని జామీయా మసీదు ముత్వల్లి అస్లాం ను కోరారు. లేనిపక్షంలో యువకులంతా పోరాటానికి సిద్ధమవుతామన్నారు. దీనిపై స్పందించిన ముత్వల్లి ప్రత్యేక కమిటీ వేసి విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జామీయా మసీదు కమిటీ తో పాటు యువకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శాసనకోట విద్యార్థిని

ప్రజాశక్తి - పరిగి

ప్రతిభావిద్యార్థితో ప్రధానోపాధ్యాయుడు,వ్యాయామ ఉపాధ్యాయురాలు

మండలంలోని శాసనకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని కె.శాలిని క్రీడారంగంలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పాఠశాల గేమ్స్ ఫెడరేషన్,ఎస్.జి.ఎఫ్ హామర్ త్రో పోటీలకు ఎంపికయ్యింది.ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అండర్-17 విభాగపు పోటీల్లో శాలిని అద్భుత ప్రతిభతో ప్రథమస్థానం సాధించి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించింది. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.శ్రీధరమూర్తి విద్యార్థినిని అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ లోకేశ్వరి మార్గదర్శకత్వంలో శాలిని క్రమశిక్షణతో శిక్షణ పొందుతూ రాష్ట్ర స్థాయిలోనూ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలినికి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి హామర్ త్రో ఎస్.జి.ఎఫ్ పోటీలు వినుకొండ మండలం, పల్నాడు జిల్లాలో జరగనున్నాయనివ్యాయామ ఉపాధ్యాయురాలు లోకేశ్వరి వెల్లడించారు.

డిప్యూటీ సిఎంను కలిసిన ఎమ్మెల్యే, మాజీమంత్రి

ప్రజాశక్తి - కొత్తచెరువు



డిప్యూటీ సిఎంతో ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి సాస్కీ పథకం నుంచి రూ.35 కోట్ల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన పవన్ కళ్యాణ్‌ను బుధవారం మధ్యాహ్నం ఇరువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. రహదారి పనుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఈసందర్భంగా వారు పవన్‌కళ్యాణ్‌ను ఆహ్వానించారు. అమడుగూరు, బుక్కపట్నం, కొత్త చెరువు, నల్లమడ, ఓబుల దేవర చెరువు తదితర ప్రాంతాల నుంచి పుట్టపర్తికి చేరే రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

వైఎస్ జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు



వైఎస్‌జగన్‌తో జిల్లా వైసిపి నాయకులు

ప్రజాశక్తి - హిందూపురం

కార్యాలయంపై దాడి గురించి వివరణ

తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆపార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డిని సత్యసాయి జిల్లా వైకాపా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, నాయకులు గుడ్డంపల్లి వేణు రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఇటీవల హిందూపురంలోని వైసిపి కార్యాలయం పై టిడిపి నాయకులు చేసిన దాడి సంఘటన, అనంతరం పరిణామాలు తదితర అంశాలను అధినేతకు వివరించారు. అధైర్య పడకుండా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని, కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపేందుకు కృషి చేయాలని అధినేత తమకు సూచించినట్లు జిల్లా నాయకులు తెలిపారు.

యువత వ్యవసాయం వైపు అడుగేయాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

వ్యవసాయ అభివృద్ధి రోజు రోజుకు తగ్గిపోతుందని,ఇది దేశానికే ప్రమాదకరమని మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ రెండో విడత నిధులు పంపిణీ కార్యక్రమంలో బుధవారం వారు పాల్గొన్నారు. గొట్లూరు గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్, పరిటాల శ్రీరామ్, హిందూపురం ఎంపీ పార్థసారథి, జనసేన ఇన్ ఛార్జి చిలకం మధుసూదన్ రెడ్డి, రైతులు, అధికారులు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం మొదలుపెట్టిందన్నారు. ఇందులో భాగంగా పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద మొదటి విడత ఒక్కో రైతుకు 7వేల రూపాయలు అందించినట్లు చెప్పారు. ఇప్పుడు రెండో విడత కింద మరో 7వేల రూపాయలు అందుతుందన్నారు. దీనివల్ల రైతులకు ఎంతో కొంత సాయంగా ఇది ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా భారత దేశంలో వ్యవసాయ భూమి ఎక్కువగా ఉందన్నారు. కానీ ఇటీవల చాలామంది రైతులు వ్యవసాయంలో గిట్టుబాటు ధరలురాక , పంటలు పండక, సాగుకు దూరమవుతున్నారన్నారని అన్నారు. ముఖ్యంగా యువత వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు.

కదిరి టౌన్ : కూటమి ప్రభుత్వం రైతన్న కి వెన్నుదన్నుగా నిలుస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. కదిరి పట్టణం హిందూపూర్ రోడ్డు వ్యవసాయ పరిశోధన కేంద్రం నందు అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం కింద రెండవ విడత సాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వం పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ప్రభుత్వం ఏర్పడిన 18 నెలలు కాలంలో సూపర్ సిక్స్ హామీలు అమలు చేశామో లేదో పిల్లలను నుండి పెద్దల వరకూ వెళ్లి అడగాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్ భాను, మున్సిపల్ చైర్ పర్సన్ దిల్షాద్, టిడిపి రైతు మండల అధ్యక్షుడు తిరుపాల్ యాదవ్, మాజీ రైతు సంఘం నాయకుడు శంకర తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : మండలంలోని ప్యాదిండి గ్రామంలో అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ 2వ విడత నిధులు విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. అనంతరం ఉలవల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులకు సబ్సిడీపై ఉలవలు అందజేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఇటీవల ప్రధాని చేతుల మీదుగా సత్కారం అందుకున్న బత్తలపల్లి మండలం రాఘవపల్లికి చెందిన గంగమ్మకు అనే మహిళా రైతును ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో ముఖాముఖి నిర్వహించారు.

కొత్తచెరువు రూరల్ : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పోతులకుంట గ్రామంలో బుధవారం సాయంకాలం రెండవ విడత అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నిధులను విడుదల చేస్తున్న సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సతీష్ బాబు, ఉద్యానవన శాఖ అధికారి నవీన్ కుమార్, ఏఈఓ సునీత, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు ఎస్ శ్రీనివాసులు, నాగేంద్రప్రసాద్, హరిప్రసాద్, షర్ఫుద్దీన్, రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నిధులు విడుదల సందర్భంగా మండలంలోని దేవరహట్టి గ్రామంలోని క్లస్టర్ ఇంచార్జ్ చిత్ర శేఖర్ యాదవ్ తోటలో రైతులు, కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి రాష్ట్రవక్కలి గల కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి స్వామి, గుడిబండ మండలం టిడిపి కన్వీనర్ లక్ష్మీ నరసప్ప సింగల్ విండో అధ్యక్షులు మద్దన కుంటప్ప, మాజీ ఆస్పత్రి కమిటీ చైర్మన్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

మెగా చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట



మెగా చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర



మెగా చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి తదితరులు